సాక్షి
చిత్తూరు
గురువారం । 31 । అక్టోబర్ । 2024



మీటర్ రీడర్లకు బాబు షాక్

విద్యుత్ మీటర్ రీడర్లకు ఇస్తున్న కమీషన్‌లో కోత విధించిన కూటమి ప్రభుత్వం వారికి ఊహించని షాక్ ఇచ్చింది. - 8లో



హెడ్ కానిస్టేబుల్ దాతృత్వం

హెడ్ కానిస్టేబుల్ మురళి 30 మంది హోం గార్డులకు హెల్మెట్‌లు ఉచితంగా అందించి దాతృత్వం చాటుకున్నారు. - 8లో




రాష్ట్ర కబడ్డీ విజేత చిత్తూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో చిత్తూరు బాలికల జట్టు విజేతగా నిలిచింది. - 8లో

ప్రమాదకర ఘంటిక

- చిత్తూరు నుంచి కుప్పం వరకు విక్రయాలు
- జిల్లాలో విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్
- బెంగళూరు, హైదరాబాద్ నుంచి సరఫరా
- ఇంజనీరింగ్, వైద్య కళాశాల యువతే లక్ష్యం
- మామూళ్ల మత్తులో నేతల ఉదాసీన వైఖరి

డ్రగ్స్ అంటే ఏవో కొన్ని సినిమాల్లో చూపిస్తుంటారు. మహా నగరాల్లో రేవ్ పార్టీల పేరిట చేస్తున్న వికృత చేష్టలకు డ్రగ్స్ వాడకమంటూ పేరు పెట్టి ఈ మధ్య టీవీల్లోనూ చూపిస్తున్నారు. కానీ ఇపుడు ఈ మహమ్మారి మన చుట్టుపక్కలకు వచ్చేస్తోంది. పట్టణ నాగరికత విస్తరిస్తున్న కొద్దీ.. కొందరు యువత కాలక్షేపం కోసం, సాంఘిక గుర్తింపు, విలాసాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. ఫలితంగా జిల్లాలో డ్రగ్స్ సరఫరా చాపకింద నీరులా వ్యాపించి, విద్యా సంస్థల్లో మత్తు చిమ్ముతోంది.



చిత్తూరు అర్బన్ : ఒకప్పుడు మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) అంటే గుర్తుకొచ్చేది ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాల పేర్లు మాత్రమే. కానీ సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, అరచేతిలోకి ఏదైనా తెచ్చిపెట్టే స్మార్ట్ ఫోన్ పుణ్యమా అంటూ చిన్న చిన్న పట్టణాలకు సైతం డ్రగ్స్ చాలా సులువుగా రవాణా అవుతోంది. దీని మూలాలు పట్టుకోవడానికి పోలీసులు శ్రమిస్తున్నా.. తగిన ఫలితం మాత్రం ఇవ్వడంలేదు. రెండేళ్ల క్రితం చిత్తూరు నగరంలో డ్రగ్స్ దొరకడం, దాన్ని నగరానికి చెందిన పలువురు వ్యాపారులు, పెద్ద తలలు నిత్యం వాడుతున్నట్టు పోలీసుల విచారణలో తేలడం సంచలనంగా మారింది. అయితే ఇప్పుడు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. చిత్తూరుతోపాటు పలమనేరు, పుంగనూరు లాంటి పట్టణాల నుంచి కుప్పం వరకు డ్రగ్స్ వాడే సంస్కృతి పాకిపోయింది.

రాజకీయ రంగు

ఇప్పటికే రోజూ గంజాయి రుచి లేనిదే కళాశాలలకు కూడా వెళ్లలేని కొంత మంది యువకులు, క్రమంగా డ్రగ్స్‌వైపు అడుగులు వేస్తున్నారు. గత రెండు నెలల్లో చిత్తూరు, బండపల్లె, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో 200 కిలోల వరకు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. చిత్తూరులో డ్రగ్స్ అమ్మే వారి దగ్గరకు వెళ్లిన పోలీసులు పట్టుకునే సమయంలో ఆ ముఠా జారిపోయింది. అయితే మాదక ద్రవ్యాలను విక్రయించే వాళ్లకు అధికారపార్టీ నాయకులు అండగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. చిత్తూరు నగరంలోని ఇరువారం వద్ద గంజాయి విక్రయిస్తున్న ఓ ముఠాను పట్టుకున్నారు. కానీ ఈ ముఠాకు ఎక్కడి నుంచి గంజాయి వస్తోంది? చిత్తూరులో ముడిపడి ఉన్న పెద్దలు ఎవరు? నిందితుల అరెస్టులో వాహనాలు వదిలేయడానికి కారణాలేంటి? అనే విషయాలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇక చిత్తూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీ కండువా కప్పుకున్న ఓ కార్పొరేటర్ పేరు ఇటీవల డ్రగ్స్ విక్రయాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. తనకు ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయని ఖాకీలనే తప్పుదారి పట్టిస్తూ తప్పించుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఇలాంటి వ్యక్తులను ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వాళ్ల నుంచి ఏవైనా వాటాలు తీసుకుంటున్నారా? వారి నుంచి మరో రకమైన లబ్ధి ఏదైనా ఉందా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కుప్పంలో గంజాయి ముఠాను పట్టుకున్నప్పుడు ఏకంగా ముగ్గురు తమ్ముళ్లు స్టేషన్‌లోకి వచ్చి చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఇక పుంగనూరు, పలమనేరులో జరుగుతున్న గంజాయి వ్యాపారానికి ఎవరి అండదండలు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గంజాయి వ్యాపారాల్లో వచ్చే వాటాలు చాలడం లేదనుకున్నారో ఏమోగానీ.. ఇప్పుడు డ్రగ్స్‌వైపు అడుగులు వేస్తుండడంతో కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలకు పెద్ద మొత్తంలో మామూళ్లు ముడుతున్నట్లు తెలుస్తోంది.


సరిహద్దు శాపమా..?



చిత్తూరులో పట్టుబడిన మాదకద్రవ్యాలు (ఫైల్)

తమిళనాడు, కర్ణాటక లాంటి రాష్ట్రాలకు చిత్తూరు సరిహద్దు కావడంతో మాదక ద్రవ్యాలు సులభంగా ఇక్కడకు వచ్చేస్తున్నాయి. జిల్లా చుట్టూ చెక్‌పోస్టులు ఉన్నా.. డ్రగ్స్‌ను తెప్పించేవాళ్లు ఎవరనేది పక్కా సమాచారం ఉంటే తప్ప పట్టుకోవడం పోలీసులకు సాధ్యం కావడంలేదు. పైగా పౌడర్, స్ఫటిక రూపంలో ఉన్న డ్రగ్స్‌ను గుర్తించడం అంత సులభం కాకపోవడంతో నిందితులు వీటిని జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు అర్థమవుతోంది. గోవా, ఢిల్లీ ప్రాంతాల నుంచి బెంగళూరుకు డ్రగ్స్ రావడం.. అక్కడి నుంచి మారుమూల పల్లెటూర్లకు సైతం పంపిణీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పోలీసు శాఖ నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలనే బాధ్యతను గుర్తుచేస్తోంది.

అక్కడే అధికం



జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు వైద్య కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలో చదువుకునే యువతే లక్ష్యంగా డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందులో చిత్తూరు నగరంతో పాటు దాదాపు అన్ని పట్టణాల్లోనూ డ్రగ్స్ వ్యాపారం బాగానే సాగుతోంది. ఇటీవల చిత్తూరులోని ఓ ప్రముఖ కళాశాలలో మిథైలెనెడియోక్సీ-మెంథాఫెటమైన్ (ఎండీఎంఏ) అనే డ్రగ్ ప్యాకెట్ లభించగా, బయటకు తెలిస్తే విద్యాసంస్థ పరువు పోతుందని నిర్వాహకులు దాన్ని అలాగే తొక్కిపెట్టేశారు. ఎండీఎంఏ అనే మాదకద్రవ్యాన్ని బెంగళూరు నుంచి ఒక గ్రాము రూ.2 వేలకు కొనుగోలుచేసి, దాన్ని చిత్తూరులోని యువతకు గ్రాము రూ.4 వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం ఉంది. డ్రగ్స్‌ను ఉపయోగిస్తే బరువు తగ్గుతారని, అవెంజర్స్‌లా అద్భుతమైన శక్తి వస్తుందన్న ఊహాగానాలతో యువత ఆకర్షితులవుతున్నారు. ఏదైనా గలాటా కేసులు, చోరీ కేసుల్లో ఒకరిద్దరు మాత్రమే నష్టపోతారు. హత్య కేసులో ఓ కుటుంబం బాధింపబడుతుంది. కానీ మాదకద్రవ్యాల వినియోగంలో సమాజం మొత్తం ఇబ్బంది పడుతుంది. తన, మన అనే ఆలోచన లేకుండా మనుషుల్ని మృగాలుగా చేసే ఈ మత్తు పదార్థాలు విద్యా సంస్థల్లో వ్యాపిస్తుండడం ఆందోళన కలిగించే విషయం.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు



యువత పెడదారి పట్టడానికి తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణం. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించడానికి ప్రత్యేకమైన టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోంది. పోలీసులతో పాటు అటవీశాఖ, ఎక్సైజ్, ఇతర శాఖలతో కలిసి టాస్క్‌ఫోర్స్‌ను మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ఏర్పాటు చేశాం. కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలు, మెడికల్ కాలేజీల్లో మాదక ద్రవ్యాలు ఉపయోగిస్తున్నారనే సమాచారంతో నిఘా ఉంచాం. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేని పిల్లలు డ్రగ్స్‌ను ఎక్కువగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు గమనించాలి. మత్తు పదార్థాలు ఏవి వాడినా వెంటనే డయల్-112, పోలీస్ వాట్సాప్-9440600005కు సమాచారం ఇవ్వండి. వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. దీనికి బానిసైన వాళ్లను మామూలుగా చేయడానికి చిత్తూరులో రీహాబిలిటేషన్ సెంటర్ కూడా నడుస్తోంది. మాకు కేసులు పెట్టడం ప్రధానం కాదు. పిల్లల్ని చెడుమార్గం నుంచి దారిమళ్లించడమే ముఖ్యం. అయితే వీటిని సరఫరా చేసే వాళ్లను వదిలిపెట్టం. నిందితులు ఎంతటివాళ్లైనా కఠినంగా వ్యవహరించి, జైలుశిక్ష పడేలా చేస్తాం.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

న్యూస్‌రీల్

ఖాదర్ కుటుంబానికి అండగా ఉంటాం



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లీ, సునీల్ కుమార్

పూతలపట్టు: మండల మైనారిటీ కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లీ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆపార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎంను బుధవారం నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లీకి చెందిన పొలానికి వేసిన కంచెను ధ్వంసం చేసి, అతనిపై దాడి చేసినట్లు విన్నవించారు. పార్టీ తరపున అన్ని విధాలుగా ఖాదర్‌కు అండగా ఉంటామని వైఎస్ జగన్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 5 ఫిర్యాదులు వచ్చాయని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. చిత్తూరులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో వినియోగదారుల నుంచి వినతులను స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో మొత్తం 5 ఫిర్యాదులు రాగా, వాటిలో 2 పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. మిగిలిన వాటికి శాఖాపరంగా అనుమతులు వచ్చాక పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు ప్రసాద్, శేషాద్రి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ సెలవు రోజు అయినప్పటికీ గురువారం విద్యుత్ బిల్లులు ఉమ్మడి జిల్లాలో చెల్లించవచ్చని తిరుపతి, చిత్తూరు జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలు సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పని చేస్తాయని చెప్పారు. హెచ్‌టీ వినియోగదారులు బిల్లులు చెల్లించని పక్షంలో సరఫరా ఆపివేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ముగ్గురి ఎంపిక



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చౌడేపల్లె: జాతీయ స్థాయి అండర్–17 కబడ్డీ పోటీలకు చిత్తూరు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు హెచ్ఎం నాగరాజ రెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఎం.లిఖిత(చౌడేపల్లె) ఎస్. సనా(తిరుపతి) ఎస్ఎస్.జాన్‌పీటర్(నింద్ర) మండలాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరితోపాటు స్టాండ్‌బైలో ఎస్.సందీప్(చంద్రగిరి) సి.పల్లవి(పుదిపట్ల, చౌడేపల్లె) సైతం ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు నవంబరు 16వ తేదీ మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టునుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ రాజేంద్ర తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 59,140 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 16,937 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.31 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

పండగ పూటా పస్తులేనా?



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

- మూడు నెలలుగా అందని జీతాలు

రామకుప్పం: గత మూడు నెలలుగా తమకు జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని 108 ఉద్యోగులు వాపోయారు. నాలుగో నెల వస్తున్నా పండగ పూట తమకు జీతాలు ఇవ్వకపోవడంతో ఏమి చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామన్నారు. గత 18 ఏళ్లుగా రేయింబవళ్లు కష్టపడుతున్నామని పండగ పూట జీతాలు ఇవ్వకపోతే ఎలా? అని ఉద్యోగులు ప్రశ్నించారు. అందరు ఉద్యోగస్తులు దసరా, దీపావళి పండుగలు సంతోషంగా జరుపుకుంటున్నారని 108/104 ఉద్యోగుల కుటుంబాలు మాత్రం పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని 108 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీలు మాణిక్యం నాయక్, ఎల్లప్ప, ధనపాల్ నాయక్, పైలట్‌లు సురేష్ ,గంగాధరం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మార్చి 31 వరకు ఒక్క సిలిండరే ఉచితం

- నవంబర్ 1న ఉచిత సిలిండర్ల పథకం ప్రారంభం
- తెల్ల రేషన్ కార్డు దారులే అర్హులు
- సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రజలు మార్చి 31వ తేదీ లోపు ఉచిత గ్యాస్ రీ ఫిల్లింగ్ సిలిండర్ ఒకటి పొందవచ్చని జాయింట్ కలెక్టర్ విద్యాధరి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం నవంబర్ 1న సీఎం ప్రారంభిస్తారన్నారు. జిల్లా స్థాయిలో మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ అందజేస్తారని చెప్పారు. జిల్లాలో తెల్లరేషన్ కార్డు ఉండి ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకున్న వినియోగదారులకు ప్రతి ఏటా ఉచితంగా మూడు సిలిండర్‌లు ఇస్తారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు ఒక గ్యాస్ రీ ఫిల్లింగ్ సిలిండర్‌కు అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాళీ సిలిండర్ ఉన్నప్పుడు 5 నెలల్లో ఎప్పుడైనా గ్యాస్ సిలిండర్ రీ ఫిల్లింగ్ చేసుకోవచ్చన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో బిల్లులో ఉన్న నగదు చెల్లించి సిలిండర్ పొందాలని తెలిపారు. ఆ తర్వాత రెండు రోజుల్లో సబ్సిడీ నగదు లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతుందన్నారు. జిల్లాలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 5,43,202 తెల్లరేషన్‌కార్డులు ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు దీపం కనెక్షన్ 2,44,546 మందికి ఉన్నట్లు తెలిపారు. ఉజ్వల్ కనెక్షన్ 12,268 మందికి, మొత్తం ఎల్పీజీ కనెక్షన్స్ 5,80,297 ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 47 ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలు ఉండగా అందులో ఐఓసీ 27, బీపీసీ 9, హెచ్‌పీసీ 11 ఉన్నట్లు తెలిపారు. ఆయా ఏజెన్సీల పరిధిలో పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ శంకరన్, సివిల్ సప్లయ్స్ శాఖ డీఎం బాలకృష్ణ, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపాల శోభ

- జిల్లాలో దీపావళి సందడి
- వివిధ ఆకృతుల్లో వెరైటీ దీపాలు
- నూనె అవసరం లేని బ్యాటరీ, విద్యుత్ దీపాలకు మంచి డిమాండ్
- విక్రయానికి సిద్ధంగా మట్టి ప్రమిదలు

కాణిపాకం: దీపావళి పండగ రోజు ఇల్లంతా దీపాల కాంతులతో నింపేస్తాం. ఆ రోజు ఏ ఇంటి ముందు దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మీ ప్రవేశిస్తుందని పెద్దలు చెబుతుంటారు. అందుకే దీపావళి రోజు సాయంత్రం మహిళలు ఇంటి నిండా దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి మహాలక్ష్మీకి స్వాగతం పలుకుతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే పండగ దీపావళి. ఆశ్వయుజ మాస అమావాస్య రోజున వచ్చే ఈ పండగకు ఎంతో విశిష్టత ఉంది. అమావాస్య చీకట్లు తొలగిపోయేలా దీప మాలికల శోభ ప్రతి ఇంటా కనువిందు చేస్తుంటుంది. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో దీపావళి పండుగను జరుపుకోనున్నారు.



చిత్తూరు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మట్టి ప్రమిదలు

చూడముచ్చటైన దీపాలు

మట్టి ప్రమిదలను వివిధ డిజైన్లలో రంగులతో చూడముచ్చటగా అలంకరించిన ప్రమిదలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ కంపెనీలు తయారు చేసిన డిజైనర్ ప్రమిదలను వివిధ ప్రాంతాల నుంచి రవాణా చేసుకుని వ్యాపారులు, షాపింగ్ మాల్స్‌ల్లో విక్రయిస్తున్నారు. వీటితోపాటు ఆకర్షణీయంగా పలు రకాల క్యాండిల్స్, డెకొరేటివ్ క్యాండిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఫ్లోటింగ్ క్యాండిల్స్, సెంటెడ్ క్యాండిల్స్, వాటర్ క్యాండిల్స్, బ్యాటరీ కేండిల్స్, కుందన్ క్యాండిల్స్, జెల్ క్యాండిల్స్, క్యాండిల్ స్టాండ్స్ మార్కెట్లో కనిపిస్తున్నాయి. విద్యుత్ దీపాల సీరియల్ దండలు ఆకర్షణీయమైన రూపాల్లో మార్కెట్లో విక్రయిస్తున్నారు.

నూనె లేకుండా వెలిగే దీపాలు

మారిన కాలానికి అనుగుణంగా నూనె లేకుండా. వెలిగే దీపాలు మార్కెట్లో వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బ్యాటరీతో, కరెంట్ అచ్చం నూనె దీపంలా వెలుగులు విరజిమ్మే దీపాలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. దీపాలు వెలిగించడానికి నూనె అవసరం లేకపోవడంతో పాటు గాలి వీస్తే ఆరిపోతుందన్న భయం లేదు. ప్రతి సంవత్సరం వాడుకునే సౌలభ్యం ఉండడంతో బ్యాటరీ, విద్యుత్ దీపాలు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.

మట్టి ప్రమిదలే సంప్రదాయం



మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళ

పూర్వం నుంచి మట్టి ప్రమిదల్లో ఒత్తులు, నూనె వేసి దీపాలు వెలిగించడం సంప్రదాయం. మట్టి ప్రమిదలను మరింత అందంగా తీర్చిదిద్ది విక్రయానికి ఉంచారు. రంగులు అద్దిన దీపాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. సాధారణ ప్రమిదలతోపాటు వివిధ ఆకర్షణీయమైన ఆకృతుల్లో మట్టి ప్రమిదలు లభిస్తున్నాయి. నక్షత్ర దీపాలు, పంచముఖ దీపాలు, దీప స్తంభాలు, ఆకాశ దీపాలు, చిమ్నీ దీపాలు, పింగాణీ దీపాలు.. ఇలా విభిన్నమైనవి అందుబాటులో ఉన్నాయి. దీపాల దండలు, దీప ప్రమిదలకు మంచి ఆదరణ లభిస్తోంది.

దీపావళిని సంతోషంగా జరుపుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆకాంక్షించారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, విజయానికి ప్రతీక అయిన దీపావళి పండుగను జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలనా ఆకాంక్షిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ సుమిత్ కుమార్



జేసీ విద్యాధరి

పింఛన్ల పంపిణీ రెండు రోజులే

చిత్తూరు కలెక్టరేట్: సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు శుక్ర, శనివారాల్లో పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా నవంబర్ నెలకు సంబంధించిన పింఛన్లు అందజేస్తామన్నారు. జిల్లాలో 2,68,820 మందికి దాదాపు రూ.113.43 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆ రోజు ఇంటివద్ద లేని లబ్ధిదారులకు శనివారం మాత్రమే అందజేస్తామని పేర్కొన్నారు. ఆ రోజుల్లో లబ్ధిదారులు అందరూ తమ ఇంటి వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవాలన్నారు.

తిరుపతి డీఎంహెచ్‌వోపై విచారణ పూర్తి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం తిరుపతి డీఎంహెచ్ఓ శ్రీహరిపై విచారణ పూర్తయింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ విచారణలో గతంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని విచారించారు. రాతపూర్వకంగా వివరాలు తీసుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు, ఇంకొంత మంది ఈ విచారణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే విచారణ అంశాలను నివేదికల రూపంలో తయారు చేసి రాష్ట్ర అధికారులకు సమర్పించనున్నట్లు విచారణ అధికారి విజయలక్ష్మీ పేర్కొన్నారు.

అపార్‌ను సరళీకృతం చేయండి



డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం అమలు చేస్తున్న అపార్‌ను సరళీకృతం చేయాలని వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు బుధవారం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఈఓ వరలక్ష్మిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన డీఈఓతో మాట్లాడుతూ అపార్ కసరత్తు వల్ల క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఉన్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న టెక్నికల్ సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. అపార్ ప్రక్రియవల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు యువరాజరెడ్డి, కార్యదర్శి జయకాంత్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గత 20 ఏళ్లుగా విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లుగా పని చేస్తున్న వారికి చంద్రబాబు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఎండనకా, వాననకా ప్రతి నెలా తొలి వారంలోనే ఇంటింటికీ వెళ్లి విద్యుత్ బిల్లులు తీసే మీటర్ రీడర్లను తొలగించడానికి రంగం సిద్ధం చేసింది. గత ప్రభుత్వం ఇచ్చే వేతనం కంటే రూపాయి తగ్గించింది. దీన్ని ప్రశ్నించిన వారిని ఉద్యోగం తొలగిస్తామని బెదిరిస్తోంది. దీంతో జిల్లాలో సుమారు 500 కుటుంబాలు వీధిన పడనున్నాయి.



తిరుపతి ఎస్ఈకి వినతి పత్రం అందిస్తున్న జిల్లా మీటర్ రీడర్ యూనియన్ నాయకులు (ఫైల్)

మీటర్ రీడర్లకు బాబు షాక్

- ఒక మీటర్ రీడింగ్‌కు రూ.3.20 నుంచి రూ.2.80కి తగ్గింపు
- ఉంటే ఉండండి లేకపోతే వెళ్లిపోండి
- రంగంలోకి యువగళం టీమ్

విజయపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులపై ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే వలంటీర్లు, మద్యంషాపులో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మధ్యాహ్నం భోజనం కార్మికులు అంటూ వరుస కట్టి తొలగిస్తూ వచ్చింది. ఇప్పుడు విద్యుత్ మీటర్ బిల్లులు తీసే రీడర్లపై గురి పెట్టింది. దీంతో వారు లబోదిబోమంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్ శాఖలో 500 మందికి పైగా మీటర్ రీడర్స్ పనిచేస్తున్నారు. వీరు ప్రతి నెలా ఇంటింటికి వెళ్లి రీడింగ్ తీసి విద్యుత్ బిల్లులు అందిస్తే ఒక్కో బిల్లుకు నగరాల్లో రూ.3.60, గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.3.73 పైసలు చొప్పున చెల్లించేవారు. వాటిని సంబంధిత కాంట్రాక్టర్లు రీడర్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ పోనూ రూ.3.30 పైసలు ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మీటర్ రీడర్లకు నేరుగా వారి బ్యాంకు ఖాతాకే వేతనాలు జమ చేయాలని విద్యుత్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో రీడర్లు ఎలాంటి కోతల్లేకుండా నెలవారీ వేతనం అందుకునేవారు. అయితే కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 2019–2024 వరకు ఉన్న కాంట్రాక్టర్లను తొలగించి, తమ పార్టీకి అనుకూలమైన (యువగళం) నాయకులకు కాంట్రాక్టులను అప్పగించారు. సదరు కాంట్రాక్టరు రూ.3.30 కాకుండా రూ.2.80 మాత్రమే ఇస్తానని, ఇష్టం ఉంటే ఉండండి, లేకుంటే వెళ్లిపొండి అని బెదిరిస్తున్నారు. నిబంధనల మేరకు నూతన కాంట్రాక్టర్ మీటర్ రీడర్స్‌కు రీడింగ్ పరికరాలు, మొబైల్ ఫోన్ ఇవ్వాల్సి ఉంది, కానీ అది కూడా ఇవ్వనని, ఎవరికి వారే సమకూర్చుకోవాలని చెప్పడంతో మీటర్ రీడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎస్ఈని కలిసిన జిల్లా మీటర్ రీడర్ యూనియన్ నాయకులు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

అభద్రతా భావంతో మీటర రీడర్లు

జిల్లాలో పని చేస్తున్న మీటర్ రీడర్లు అభద్రతా భావంతో ఉన్నారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేసినపుడు ప్రతిపక్ష నేతగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం గత సర్కారు తీసుకున్న విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే నగరాలు, పట్టణాల్లో వేగవంతంగా కొనసాగుతోంది. వీటి ఏర్పాటుతో రీడర్లు ప్రతినెలా రీడింగ్ తీసి బిల్లుల ఇచ్చే పరిస్థితి ఉండదు. మొబైల్ రీచార్జి తరహాలో మీటర్లకు ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మీటర్ల ఏర్పాటు పూర్తయితే రీడర్స్ అవసరం విద్యుత్ సంస్థకు ఉండదు. దీంతో 23 ఏళ్లపాటు సేవలందించిన వీరిని ఇంటికి పంపితే వీరి కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంటుంది.

కాంట్రాక్టర్లు మా కడుపు కొడుతున్నారు



నా వయస్సు 60 యేళ్లు. గత 20 యేళ్లుగా మీటర్ రీడర్‌గా పని చేస్తున్నాను. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్లు మమ్మల్ని వద్దు వెళ్లమంటే మేము ఏ పని చేసుకోవాలి. తమ అనుకూలమైన వారికి కాంట్రాక్ట్ ఇచ్చి ఇలా మా బతుకులతో ఆడుకోవడం మంచిది కాదు. మాకు కమిషన్ పెంచుతూ, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. – గంగులయ్య, మదనపల్లె

గతం ప్రభుత్వం ఇచ్చినట్టే ఇవ్వాలి



గతంలో ఒక్కో విద్యుత్ మీటర్ రీడింగ్‌కు రూ.3.20 ఇస్తుండేవారు. నేడు రూ.2.80 మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకు కుటుంబం గడవటమే కష్టంగా ఉంది. కాంట్రాక్టర్లు తీసుకొన్న నిర్ణయం సరైనది కాదు. దీనిపై పోరాటం చేసి సాధించుకుంటాం. – బాబురెడ్డి, నాగలాపురం

15 ఏళ్లుగా పని చేస్తున్నాను



గత 15 ఏళ్లుగా తిరుపతిలో మీటర్ రీడర్‌గా పని చేస్తున్నారు. గత ప్రభుత్వం 3.20 ఇస్తే, ఈ ప్రభుత్వం రూ. 2.80 ఇస్తామని చెప్పడం సరికాదు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్లు మమ్మల్ని భయాందోళనకు గురి చేస్తున్నారు. మాకు రూపాయి పెంచాల్సింది పోయి ఇస్తున్న రేటు కంటే తగ్గిస్తామని చెప్పడం ఎంతవరకు న్యాయం. – ప్రభాకర్, తిరుపతి

ఎండనకా..వాననకా కష్టపడ్డాం



ప్రతి నెలా తొలి వారం నుంచి ఎండనకా..వాననకా కష్టపడ్డాం. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు మా కడుపు కొట్టడం సరికాదు. ప్రభుత్వం మారితే ఇప్పటి కంటే ఎక్కువగా వస్తారని ఆశపడ్డాం. కానీ ఉన్న దాన్ని తొలగించి, మమ్మల్ని బెదిరిస్తున్నారు. ఇష్టం ఉంటే ఉండండి లేకుంటే వెళ్లండి అని చెప్పడం సరైన పద్ధతి కాదు. – సయ్యద్, పాకాల

చెరకు తోటపై ఏనుగుల దాడి



ఏనుగులు ధ్వంసం చేసిన చెరకు పంట

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని వెంకట దాసరపల్లె పంచాయతీలో బుధవారం తెల్లవారు జామున ఏనుగులు పంటలపై దాడి చేశాయి. కొన్ని నెలలుగా మండలంలోనే తిష్ట వేసిన ఈ ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయి. మంగళవారం రాత్రి వరి, చెరకు, అరటి, కూరగాయల పంటలకు భారీగా నష్టం చేకూర్చాయి. విషయం తెలుసుకున్న ఫారెస్టు సిబ్బంది ఏనుగుల దాడిలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటలపై నివేదికను ఉన్నతా అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఏనుగుల సంచారం ఎక్కువగా ఉన్నందున ప్రజలు రాత్రి పూట పొలాల దగ్గరకు వెళ్లకూడదని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పుంగనూరు: పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన ఉస్మాన్ ఒక బాలికను తీసుకెళ్లి మోసం చేయడంపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. రాత్రి సీఐ మాట్లాడుతూ బుధవారం ఉస్మాన్‌తో పాటు మరి కొంత మంది బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లారని, ఈ విషయమై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇక్కడ వసూలు.. అక్కడ పంపిణీ

- తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి చిత్రాలు
- టపాసుల విక్రేతల నుంచి మామూళ్ల రూపంలో గిఫ్ట్‌బాక్స్‌లు
- చిత్తూరులోని అనుచరులకు అందజేత

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వింత పోకడలకు తిరుపతివాసులు నివ్వెరపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని చిత్తూరుకు చెందిన తన అనుచరులకు అప్పగించడంపై కూటమి నేతలే బాహాటంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు టపాకాయల దుకాణాల విషయంలో కూడా చేతివాటం ప్రదర్శించడంపై మండిపడుతున్నారు. నగరంలో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయాల నిమిత్తం పలు దుకాణాలకు కలెక్టర్ లైసెన్స్ మంజూరు చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయా దుకాణదారులను పిలిపించి ఒక్కొక్కరు 10 గిఫ్ట్‌బాక్స్‌లను తమకు అందించాలని హుకుం జారీ చేశారు. ఈ మేరకు అందరి వద్దా వసూలు చేశారు. అయితే ఈ గిఫ్ట్‌బాక్స్‌లను చిత్తూరులోని తన అనుచరులకు పంపిణీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నేతలు భగ్గుమంటున్నారు. ఎమ్మెల్యే ఆరణిని గెలిపించేందుకు కష్టపడి పనిచేస్తే, ఏమాత్రం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అంశంలోనూ చిత్తూరు నుంచి వచ్చిన వలస నేతలకే ప్రాధాన్యమిస్తున్నారని మండిపడుతున్నారు.

నరక చతుర్దశి వేడుకల రద్దు

తిరుపతిలో నరక చతుర్దశి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సర్కారు సైతం రూ.9.9లక్షలు మంజూరు చేసింది. అయితే ఎమ్మెల్యే మాత్రం వేడుకలకు రూ.15లక్షలతో అంచనాలు రూపొందించారు. ఆ నిధులను విడుదల చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్యను ఆదేశించారు. ఆమె ఈ ప్రతిపాదనకు విముఖత చూపారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలోనే వేడుకలు జరిపించాలని స్పష్టం చేశారు. దీనిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే చివరకు నరక చతుర్దశి వేడుకలనే రద్దు చేసేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజేత చిత్తూరు



చౌడేపల్లెలో క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె: అన్నమయ్య జిల్లా రాయచోటిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–17 కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలికల జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుని విజేతగా నిలిచింది. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం జిల్లా బాలికల కబడ్డీ జట్టుకు ప్రభుత్వం నుంచి రూ.25 వేల నగదు బహుమతితోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి తనవంతుగా రూ.10 వేలను నగదు అందజేశారు. విజేత జట్టుతోపాటు 4వ స్థానంలో నిలిచిన జిల్లా బాలుర విభాగం జట్టు క్రీడాకారులను, ఉపాధ్యాయులను అభినందించారు. క్రీడల నిర్వహణకు, క్రీడాకారులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని శిక్షణకు ఆర్థిక సాయం చేసిన చుక్కావారిపల్లె వాసి నవీన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రయోగాలతో మేధస్సుకు పదును



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

శాంతిపురం: కొత్త విషయాలు తెలుసుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలు చేయాలనే తపనతోనే విద్యార్థుల మేధస్సుకు పదును పెరుగుతుందని వక్తలు చెప్పారు. కూతేగౌనిపల్లి వద్ద ఉన్న శ్రీపరమహంస యోగానంద విద్యాలయలో మూడు రోజుల పాటు జరిగిన వర్క్ షాప్ బుధవారం ముగిసింది. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, హబ్ అండ్ స్పోక్ అంశంపై 12 జిల్లాలకు చెందిన 60 మంది ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా సైన్స్ అధికారి ఆర్వి రమణారెడ్డి, కడా పీడీ వికాస్ మర్మత్ ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. సరైన మార్గదర్శకుల ప్రోత్సాహం నుంచే కొత్త ఆవిష్కరణలు వస్తాయన్నారు. అటల్ ల్యాబ్‌ల ఏర్పాటు కారణంగా పిల్లలకు గణిత, జీవ, రసాయన, భౌతిక శాస్త్ర ప్రయోగాలపై ఆసక్తి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మెంబర్ భువనేశ్వరి, విద్యాలయ కరస్పాండెంట్ గోపాల్ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ దాతృత్వం

– హోంగార్డులకు హెల్మెట్ల పంపిణీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలోని స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మురళి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తాను కొనుగోలుచేసిన 30 హెల్మెట్లను పోలీసుశాఖలో విధులు నిర్వర్తిస్తున్న 30 మంది హోంగార్డులకు ఉచితంగా అందజేశారు. నగరంలోని పోలీసు అతిథి గృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చేతుల మీదుగా హోంగార్డులకు వీటిని అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ పెట్టుకోకుండా ద్విచక్రవాహనం నడిపితే ప్రాణాలకు ముప్పనే విషయం గుర్తించుకోవాలని చెప్పారు. చిరుద్యోగి అయినప్పటికీ మురళి చేసిన సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివనందకిషోర్, డీఎస్పీ సాయినాథ్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరుత బాధిత రైతుకు ఆర్థిక సాయం



రైతుకు రూ.60 చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఎఫ్‌ఆర్వో

చౌడేపల్లె: చిరుత దాడిలో మృతి చెందిన పాడి ఆవు యజమాని మండలంలోని కోటూరుకు చెందిన హుస్సేన్‌సాబ్‌కు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఎఫ్ఆర్వో వేణుగోపాల్ బాబు కలిసి బుధవారం మదనపల్లెలో రూ.60 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తవళం బీట్ పరిధిలో ఆగస్టు 18వ తేదీ చిరుతదాడిలో ఆవు మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ డీఆర్వో మదన్‌మోహన్, ఎఫ్‌బీఓ దీప, త్యాగరాజు పశువైద్య సిబ్బంది సహకారంతో పోస్టుమార్టం నిర్వహించారు. ఆవు యజమానికి ప్రభుత్వం రూ.60 వేల చెక్ మంజూరు చేసిందన్నారు. ఆర్థిక చేయూతనిచ్చిన అటవీశాఖకు, ప్రభుత్వానికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం



మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు

కుప్పంరూరల్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు దుర్మరణం పాలైన సంఘటన కుప్పం–మల్లానూరు రైల్వే లైన్‌లో పులిగుండు వద్ద బుధవారం చోటుచేసుకుంది. కుప్పం రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు, ఉత్తర భారతదేశానికి చెందిన సుమారు 25 నుంచి 30 ఏళ్ల యువకుడు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు పశువుల కాపరులు తమకు సమాచారం ఇచ్చినట్లు ఆయన చెప్పారు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహానికి పంచనామా నిర్వహించి కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. గుర్తు పట్టని విధంగా శరీర భాగాలు ఛిద్రమయ్యాయని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

రాష్ట్ర ఖోఖో పోటీలకు తీర్థం విద్యార్థిని



ప్రత్యూష

బైరెడ్డిపల్లె : మండలంలోని తీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ప్రత్యూష అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రత్నమ్మ తెలిపారు. విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో నవరంబర్ 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ఖోఖో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నీవానది పరిశీలన



కొట్రకోన పంచాయతీలో నీవానదిని పరిశీలిస్తున్న అధికారులు

గంగాధర నెల్లూరు: మండలంలోని మూడు గ్రామాల వద్ద నీవానది పరీవాహక ప్రాంతాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలోని కొట్రకోన, ముక్కలతూరు, ఎల్లాపల్లె పంచాయతీల వద్దగల నీవానది నుంచి గత ప్రభుత్వంలో ఎంత మేరకు ఇసుక తరలించారు. ప్రస్తుతం ఎంత నిల్వలున్నాయి అనే విషయమై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. స్థానిక అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.